

# కలల కౌగిళ్ళు

శ్రీకంఠస్ఫూర్తి

ప్రతిమ కల్పన థియేటరు ముందు ఫేన్సీ షాపు షెల్టరులో నిలబడి, రోడ్డు మీద పరుగెత్తే వాహనాల వైపు పరీక్షగా చూస్తోంది. థియేటరు ముందు గుంపులు గుంపులుగా ఉన్న జనంలోకి గుచ్చిగుచ్చి దృష్టిని సారిస్తోంది. ప్రక్కనే ఎనిమిదేళ్ళ చెల్లెలు సునీత ప్రతిమ చేతిని గుంజుతూ, అరగంట నుంచి విసుగును, కోపాన్ని అభినయిస్తోంది. కల్పనా థియేటర్సులో 'కలల కౌగిళ్ళు' సినిమా ఇంకా

మొదలు పెట్టలేదు. కొంత ర్లము ందు టిక్కెట్లకోసం కమ్మలాట మాత్రం ఎప్పుడో మొదలయ్యింది. అరు వారాలుగా ఆ చిత్రం ప్రదర్శింపబడుతున్నా రద్దీ తగ్గలేదు- దానికి. పైగా ఆ రోజు ఆదివారం. మరింత రష్‌గా ఉంది. టిక్కెట్లు తీసుకుని సినిమా హాల్లోకి వెళ్ళిపోదామంటూ చెల్లెలు సునీత మారాం చేస్తోంది.... మరీకొంత గారాన్నీ ప్రదర్శిస్తోంది.

థియేటరు ముందు సిటీబస్సు ఒకటి ఆయాసంతో వచ్చి ఆగింది. అంతలోనే మరో బస్సు దూసుకు వచ్చి ఆగిన బస్సు ముందుకు పోయి నిలబడింది. రెండు బస్సుల్లోంచి రెండు పాతికల ఆడా మగా శాల్తీలు కలల కౌగిళ్ళ కోసం కంగారు పడుతూ దిగి జనంలో కలిసిపోయారు. ప్రతిమ కళ్ళు ఆ జనంలో పరిచయమైన వ్యక్తి కోసం పత్తికాయల్లా విచ్చుకుని చూశాయి. ప్చ్.... పిక్చరుకు టైమవుతున్నా ఎక్కడా పత్తాలేదు.... ఏమయి ఉంటుంది? ఎందువల్ల రాలేదు? అసలు రావటం జరుగుతుందా? తను అనవసరంగా తొందరపడి వచ్చిందేమో! పోనీ సినిమాకు వెళ్ళిపోతే! ఉహుఁ ప్రయత్నం అంతా వృధా కాదూ! ప్రతిమ మనస్సు పరిపరి విధాలుగా గిరికీలు కొడుతూంది.

ప్రతిమ ప్రాణమున్న పాలరాతి బొమ్మే కాదు.... పెళ్ళి కాని పాతికేళ్ళ యువతి కూడా.... ఎనమండుగురి పెళ్ళి కొడుకుల్ని ఎప్పటికప్పుడే, కట్టుకున్న మొగుడిగా కమ్మగా ఊహించేసుకుని, ఆ ఊహలు ఉరేసుకున్న మరుక్షణంలో నైరాశ్యాన్ని నరనరాల్లో నింపుకున్న మధ్యతరగతి మందారం.... కన్నతండ్రి కక్కుర్తిపడి లంచంలో చేయి తడుపుకుంటూ ఉన్న వుద్యోగానికి నీళ్ళొదిలేస్తే కుట్టుమిషను మీద కాళ్ళు పెట్టి, చదువుకున్నా చుట్టిన సన్నజాజి.... తండ్రి ఉద్యోగం పోయిందని తాగుడు, తోడు తెచ్చుకుంటే, తల్లికి తండ్రితో పోట్లాడడంలోనే పగలూ రాత్రుళ్ళు గడిచిపోతే, ఇంటికి పెద్ద దిక్కై నిలిచిన ముద్దబంతి. ప్రతిమ కన్నె మనసుకూ కలలు కనే కళ్ళున్నాయి. ఆ కలలు కనే కళ్ళకూ కమ్మని మనస్సూ ఉంది.

"అక్కా! రావే! టైమయి పోతోంది... అందరూ హాల్లోకి వెళ్ళిపోతున్నారు." చెల్లెలు సునీత మరొకసారి చేయి గుంజటంతో ప్రతిమ ఉలిక్కిపడింది.

"ఉష్‌ ఉండవే! సినిమా కింకా టైముందిలే! వెధవగోల పెట్టకు. నా ఫ్రెండు రావాలి. ఇక్కడే ఎదురు చూస్తానని చెప్పాను." ప్రతిమ చెల్లెల్ని అనునయిస్తూ హేండుబ్యాగులోని చాక్‌లెట్ తీసి చేతిలో పెట్టింది.

థియేటరు ముందుకు స్కూటరొకటి దూసుకువచ్చి ఆగింది. క్రికెట్ హీరోలా ఉన్న కుర్రాడి నడుంపట్టుకుని పిలియన్ మీద కూర్చున్న పిల్ల నేలమీదకు

చెంగున దూకింది. ప్రతిమ ఆ జంటను చూసి జడుసుకున్నట్టయి గుండెల మీద చేయి వేసుకుంది. మీగడ రంగులో మెడనుండి పాదాల వరకూ మెరిసి పోతూన్న సింథెటైన మేక్సీ, నడుమువద్ద నల్లటి బెల్టు, ఎత్తుమడమల ఎర్రటి చెప్పల్సు, ఒకే రిబ్బనుతో ముడిపెట్టి జాలీగా గాలికి వదిలేసిన పడ, గుండెల మీద లాస్యం చేస్తున్న 'లవ్‌బర్డ్స్' లాకెట్, ఎగిసిపడుతూన్న యవ్వనం, ఎంతో హుందాగా.... అందంగా.... ఎవరదీ! కార్పొరేషను కంట్రాక్టరు రంగారావుగారి కూతురు.... సరిత కదూ! వాళ్ళ బంగళాకు నాలుగిళ్ళ ముందుగానే తమ ఇల్లూ ఉంది. సరిత హైస్కూల్లో ఒకప్పుడు తన క్లాస్‌మేట్ కూడా....

క్రికెట్‌హీరో జేబులోంచి రెండు ఎడ్వాన్సు టిక్కెట్లేమో సరిత చేతిలో ఉంచి చకచకా స్కూటరును స్టాండు వైపుకు నడిపించుకుపోయేడు. సరిత అక్కడే నిలబడి చేపపిల్లలాంటి కళ్ళను మిలమిలలాడిస్తూ, గుండెలమీద 'లవ్ బర్డ్స్' లాకెట్‌ను పళ్ళమధ్య ఇరికించి జనాన్ని హుషారుగా పరికిస్తోంది.

వాళ్ళిద్దరూ కలిసి తిరగడం కొత్తా కాదు.... కలల కౌగిళ్ళ సినిమా రావడం వింతా కాదు.... కాని సరితకు ఢిల్లీ నుంచి వచ్చేవాళ్ళ బావతో, నాలుగు రోజుల్లోనే పెళ్ళి.... శుభలేఖలు కూడా చాలా ఊళ్ళకు పరుగెత్తుకు వె ళా్ళ యి. మొన్ననే తను వాళ్ళింటికి వెళ్ళి సరితకు తీసిన ఇరవై పట్టుచీరలకి, బ్లౌజులకి బోర్డర్లు కుట్టింది. దజను రిలాక్సింగ్ మేక్సీలకి డిజైనులల్లింది. ఆ మధ్య క్రికెట్ హీరోతో సరిత పిక్నిక్ పేరు చెప్పి, ఏదో గెస్టుహౌస్‌లో మూడురోజు లుండిపోతే, రంగారావుగారు కంగారు పడి పోలీసు రిపోర్టివ్వటం అందరికీ తెలిసిందే!.... మరొకసారి సరిత ఒక మందుల కంపెనీ రిప్రెజెంటెటివుతో కలిసి, అతని గదిలో కొత్తసుఖాలు చవి చూపించే మత్తుమాత్ర లేవో మింగి, కొన్ని రాత్రుళ్ళు గడపటం, ఆ తర్వాత ఆ మాత్రలకు అలవాటుపడి తరచూ అతని గదికి వెళ్ళడం, రంగారావుగారికి తెలిసి కోపంతో కట్టుదిట్టం చేయడం, తనకు తెలిసిందే! పెళ్ళి దగ్గరకొస్తున్నా, మరి వీళ్ళిద్దరూ ఇంకా కలిసి తిరగడంలో అంతరార్థం? తను ఎప్పుడైనా సరిత ఇంటికి వెళ్ళినపుడు స ర దా గా నే- మాట్లాడుతుంది. సరితా! మీ బావతో పెళ్ళి నీ కిష్టమేనా! అని ఒకసారి అంటే మనస్ఫూర్తిగా చేసుకుంటున్నాను అంది. దాని మనస్తత్వం ఏమిటో మరి.... తల్లంటే భయంలేదు. తండ్రి నెత్తిమీద కెక్కే గారాబం ఉంది.... వయసులో ఉన్న ఆడపిల్ల నన్న స్పృహ లేదు. ఒంటరిగా ఎక్కడికైనా వెళ్ళగల ధైర్యం ఉంది. స్నేహితులతో షికార్లు .... చీకు, చింతా లేని జీవితం.... సరిత ఎంత అదృష్టవంతురాలు!

హేండ్సమ్ హీరో స్కూటరును స్టాండులో పెట్టి చురుగ్గా వచ్చాడు. సరిత భుజాలమీద చెయ్యివేసి, విజిల్ వేస్తూ బాల్కనీ వింగ్వైపు నడిపించుకు పోయేడు. ప్రతిమకు వాళ్ళిద్దర్నీ చూస్తూంటే మనసు మొద్దుబారినట్టు య్యింది. ఏదో సన్నటి అసూయలాంటి భావం.... అణువణువు వ్యాపించి అలాగే ఉండిపోయింది.

"అక్కా! ఎంతసేపే ఇలా నిలబడటం? నా కిప్పుడు వెంటనే సినిమా చూపిస్తావా! ఇంటికి తీసికెళ్ళిపోతావా! చెప్పు?" చెల్లెలు సునీత చిరాకు పరాకాష్ఠ నందుకోవడంతో- ప్రతిమ మనస్సు కూడా విసుగును కొనితెచ్చుకుంది.

"అయిదు నిముషాలుండవే! సినిమాకే వెళ్ళిపోదాం! ఎడ్వాన్సు టిక్కెట్లు కూడా నా ఫ్రెండు దగ్గరే వున్నాయి." ప్రతిమ చెల్లెలుతో సీరియస్గా చెప్పి జనంవైపు మళ్ళీ దృష్టిని సారించింది. థియేటరు కాంపౌండు లోపల; ముందు గోల.... టిక్కెట్లకోసం హోరాహోరీ పోరాటం .. రోడ్డుమీద పరుగెడుతూన్న వాహనాలు.... ముసలి హీరో కౌగిలిలో జలపాతం కింద తడుస్తూ.... పరవశించి పోతూన్న పదహారేళ్ళ హీరోయిన్ పరువాల సౌందర్యం- ఫోకస్ చేస్తున్న ఫోర్షీట్ వాల్పోస్టరు....

ఎందుకు రాలేదింకా! తప్పనిసరిగా రావాలే! తనను అయిదున్నరకే రమ్మని ఆరుంపావు అవుతున్నా రాకపోవడమేమిటి? మనసులో ఆశ.... మరుక్షణంలో నిరాశ.... ముప్పావుగంట నుంచి ఎదురుచూస్తున్న తనను, ఎవరైనా తమ వీధిలో తెలిసిన ముఖాలు గమనిస్తున్నాయా! ఒకవైపు అనుమానం.... భయం.... ప్రతిమ కళ్ళు అన్నివైపులా కలయచూస్తున్నాయి.

ప్రతిమ నిలబడ్డ చోటుకు పదడుగుల దూరంలో రిక్షా ఒకటి వచ్చి ఆగింది.... రిక్షాలోంచి తొంగిచూసిన గౌరి గబగబా రిక్షా దిగి, ఆనందంగా అమ్మాయిగారంటూ ప్రతిమ దగ్గరికి వచ్చింది. గౌరి కాంట్రాక్టరు రంగారావుగారింట్లో పని మనిషి.... ఎప్పుడైనా పరికిణీలు, జాకెట్లు తనవద్దనే కుట్టించుకుంటుంది. చలాకీగా నవ్వుతుంది. ఎదుటివాళ్ళను నవ్విస్తుంది. మంచిపిల్ల.... గౌరి నిన్న కూడా కనిపించి ఎన్నో కబుర్లు చెప్పిందే! నిన్నటి గౌరికి, ఇప్పటి గౌరికి తేడా ఏమిటి? వేషంలో మార్పు- ఇంతలో ఎలా వచ్చింది? ముఖంలో కొట్టొచ్చినట్టు కనిపించే కొత్తవెలుగు! మరింకెక్కడా కనిపించని సిగ్గు....

"అమ్మాయిగోరూ! ఈడ నిలబడినారేటండీ! అదేటి అలాగైపోనారు? నేను గౌరిని.... నిన్న సందసేల బరంపురం నుండి మా మావొచ్చిశాడండి! మూర్తాలు మూణ్ణెళ్ళదాకా లేవంట గదాండి! మా వోళ్ళు రాత్రికి రాత్రే- లగ్గం ఎట్టేసి

నారండి.... నాకూ మావమీద మనసుండి పోనాదండి.... మనువాడేసినానండి.... అల్లుడుగోనండి మావ.... బట్టలమిల్లులో వాచ్‌మన్ పనిచేత్తాడండి...."

అరడుగుల మనిషి.... నల్లగా నిగనిగలాడుతూన్న ఒళ్ళు.... తెల్లటి బట్టల్లో మరింత నల్లగా ఉన్నాడు. నోట్లో సిగరెట్.... రిక్షావాడికి డబ్బులిచ్చి పొగరుగిత్తలా గౌరిదగ్గరకు నడిచి వచ్చాడు.

"వత్తామండి! అమ్మాయిగోరూ! సిన్మాకి టైమయిపోతన్నాది." గౌరి అరడుగుల భర్త చేయిపట్టుకుని ఆనందంగా నేలక్లాసువైపు నడుస్తూ వెళ్ళిపోయింది.... పసుపుపచ్చని చీర.... రవిక, మెడలో మంగళసూత్రం, కాళ్ళకు మట్టెలు, పారాణి.... స్త్రీ జీవితంలో పెళ్ళి, పెద్ద మలుపే అయితే, గౌరి ఆ మలుపును ఎంత సులువుగా చేరుకోగలిగింది! నిన్నటి గౌరి ఒంటరిది. నేటినుంచి తన జీవితానికో తోడు తెచ్చుకుంది. నిజానికి వయసులోనూ తనకంటే ఏడెనిమిదేళ్ళ చిన్న.... హూఁ. ప్రతిమ మనసు తెలియని బాధతో కుతకుతలాడుతూంది.

అసలు తనకు పెళ్ళి జరుగుతుందా? అమ్మా నాన్న తనను అత్తవారింటికి పంపగలరా! అందరిలా తను కూడా పెళ్ళయిన భర్తతో అందని అనుభూతులెన్నో అందుకోగలుగుతుందా! ఊహూఁ. అంతా వట్టి భ్రమ.... తనకు పెళ్ళి జరిగే అవకాశం లేదు. కన్నవాళ్ళు పెళ్ళి చేయలేరు. ఉన్న ఒక్క ఇల్లు అమ్ముకున్నా వాళ్ళడిగే కట్నాలకు కానుకగా ఆ ఇల్లు సరిపోదు.... తమ్ముడి చదువు.... ఉద్యోగం.... ఎప్పటిమాట? కుట్టుమిషను ముందు కూర్చోవడం, కాలాన్ని ముందుకు నెట్టడం.... తనకంటే చిన్నవాళ్ళను తల్లిలా సాకడం.... తల్లికీ తండ్రికీ మధ్య తగువులు తీర్చడం.... అంతే....

ప్రతి రోజూ ఇవే తనను పలకరించే, మనసు పలవరించే పిచ్చి ఆలోచనలు.... కోరికలు.... రాత్రిళ్ళు నిద్ర కరుణించదు.... ఏదో పుస్తకంతో మస్తిష్కాన్ని జతచేసి.... ఎప్పుడో నిద్రలోకి జారిపోవడం.... అదిగో అప్పుడే అతను ఎదురింటి మేడ పైభాగంలో అద్దెకు దిగాడు. పేరు భరణి.... బ్రహ్మచారి(ట). పత్రికలకు కథలు వ్రాయడం.... ఒక ప్రెస్సులో కాలక్షేపానికి ఉద్యోగం చేయటం.... వీధిలో ఎదురయితే సూటిగా కళ్ళల్లోకి చూడటం.... చిరునవ్వుతో పరామర్శించటం.... కిటికీ దగ్గర అర్ధరాత్రి వరకు పచార్లుచేయడం.... కులం పట్టింపు లేకపోతే పెళ్ళి చేసుకుంటానని.... నాలుగైదు ఉత్తరాలు రాశాడు. భరణి గదిలో పనిచేసే కుర్రాడు, అతను గదిలో లేనప్పుడు తన కుట్టుమిషను ముందు కూర్చొని కబుర్లు చెప్పేవాడు. కాలక్షేపానికి భరణి గదిలో

నుండి పత్రికలేవో తెచ్చేవాడు. ఆ పత్రికల్లో ప్రత్యక్షమయిన భరణి ఉత్తరాలు, తన బ్రతుక్కి నిజంగా వరాలే! అణగారిన ఆశల్ని ఎన్నిటినో చిగురింపచేసిన పన్నీటి ధారలే! అయినా అర్నెల్ల పరిచయంలో అతనికి ఏనాడూ జవాబివ్వలేదు.... బదులు పలకలేదు. జవాబివ్వాలంటే మనసు మారుమూల భయం.... స్నేహం పెంచుకోవాలంటే సంకోచం.... ఫలితం చివరి ఉత్తరం అతని చిరుకోపాన్ని, స్థిర నిశ్చయాన్ని మోసుకొచ్చింది. సినిమాహాలుకు రమ్మని పిలిచింది. రాకపోతే అదే ఆఖరు ఉత్తరమని బెదిరించింది....

ప్రతిమ కళ్ళు మిలమిల మెరిశాయి. మనసులో అలజడి... తొట్రుపాటు.... తొందర.... భయం.... ఎదురుగా భరణి రిక్షాలోంచి దిగి.... గబగబా తనవైపు నడిచివస్తూ.... చింతపిక్క కలర్ ఫుల్ హేండ్స్ షర్టు, ఊదారంగు పేంటులో ఇన్‌షర్టు చేసి.... హుందాగా.... చెరిగిపోతూన్న క్రాపును సరిదిద్దుకుంటూ, చెరగని చిరునవ్వును పెదాలపై చెడుగుడు ఆడిస్తూ....

"సారీ! వెరీ సారీ! ఆలశ్యం అనివార్య మయిపోయింది. ఎక్స్‌ప్లనేషను హాల్లో విన్నవించుకుంటాను.... ఒక్క నిముషం.... మీ రిక్కడే ఉండండి. ఎడ్వాన్సుగా టిక్కెట్లు తీయడానికి వీలుపడలేదు. బ్లాకులో ఎలాగో టిక్కెట్లు సంపాదిస్తాను." వచ్చినంత విసురుగా వెనక్కి, హడావుడి పడిపోతూ జనంలోకి దూసుకుపోయిన — భరణిని బొమ్మలా చూస్తూండిపోయింది-ప్రతిమ.

"ఏమ్మా! ప్రతిమా! ఇక్కడ నిలబడ్డావే! సినిమాకు వెళ్తున్నావా? నీతో మాట్లాడిన ఆ అబ్బాయి ఎవరు? మీ బంధువా! స్నేహితుడా!" ప్రక్కనే బాటు పేలినట్టు అదిరిపడింది ప్రతిమ.... నాలుగడుగుల దూరంలో నిలబడి పలకరించిన వ్యక్తిని నిలువుగుడ్లేసి— ఒక్క క్షణం నోరు విప్పలేకపోయింది.... తమ వీధిలో ఇంటింటికీ తిరిగి పాలమ్ముకునే పుల్లమ్మ.... అమ్మో!

"ఏంలేదు,పుల్లమ్మా! సరదాగా సినిమా కనే వచ్చాను. టిక్కెట్లు దొరకలేదు. మా నాన్నగారి స్నేహితుడాయన. టిక్కెట్లు తీసుకొస్తానంటేనూ"—

"సరేలేమ్మా! జాగ్రత్త మరి...." పుల్లమ్మ నెత్తిమీద తట్టతో కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయింది.

'ఇదేం ఖర్మ! పుల్లమ్మ కళ్ళలో పడవలసి వచ్చింది.... దానికి వాగుడు ఎక్కువ. ఊళ్ళోవాళ్ళందరి గొడవలూ, దాని నోట్లోనే గాలి పోసుకుంటాయి.... ఏదీ? ఈయనింకా రాలేదే! టిక్కెట్లు దొరకలేదా? ఈ రద్దీలో టిక్కెట్లు దొరుకుతాయా అసలు? ఉత్తరంలో ఎడ్వాన్సు టిక్కెట్లు తీశానని రాశాడు.... ఇప్పుడిదేవిటి?'

"అక్కా! ఎప్పుడొచ్చారే, ఆయన. మన వీధిలో మేడమీద అద్దెకుంటారు గదే!" చెల్లెలు సునీత సందేహంగా ప్రతిమవైపు ఆసక్తిగా అడిగింది.

"ఛీ! నోర్ముయ్.... తర్వాత చెప్తానులే!" ప్రతిమలో తెలియని చికాకు.... స్థిమితంలేని ఆలోచనలు.... ఆయన టిక్కెట్లు తీసుకొస్తే కూడా వెళ్ళాలా? వెళ్ళేటప్పుడు మళ్ళీ ఎవరి కళ్ళల్లోనైనా పడుతుందా— హాల్లోకి వెళ్ళిన తరువాత భరణీ పక్కనే కూర్చోవాలి కదూ! కూర్చోవాలి.... తప్పదు.... మొదటి సారిగా మగవాడికి దగ్గరగా కూర్చోవడం.... తీరా కూర్చున్న తరువాత ఆయన ప్రవర్తన ఎలా ఉంటుంది? చేయి చేయి కలిపి.... చెవుల్లో గుసగుసలాడి గుండెల్ని కలగలిపి.... గందరగోళం చేస్తే!.... ఏం జేస్తుంది తను? అసలు భరణీ బ్రహ్మచారేనా! తనని నిజంగా ప్రేమిస్తున్నాడా? అతను రాసే కథల్లోకి మల్లే తనని పెళ్ళిచేసుకుంటాడా? కట్నం, కానుకలు, ఖర్చులూ లేకుండా తనకు పెళ్ళి జరుగుతుందా? అతనికి ఎవరూ లేరనడం ఎంతవరకు నిజం? ప్రతిమ తల విదిలించుకుంది. అన్నీ సందేహాలే! అస్తవ్యస్తమైన ఆలోచనలే! ఎలా?

పుల్లమ్మ కళ్ళల్లో పడిందే తను! దాని కళ్ళల్లో ఏదో అనుమానం తొంగి చూసింది. అది పదిళ్ళకు వెళ్ళి నాలికకు పని కల్పిస్తుందేమో! ఇంతవరకూ పెళ్ళి మాటెలా ఉన్నా, ఎవరితోనూ వేలెత్తి చూపించుకోలేదు. ఎవరైనా తేలికగా మాట్లాడితే తన మనసు తట్టుకోగలదా! అమ్మానాన్నకు విషయం తెలిస్తే సహించగలరా! ఎంత గొడవ? చెడ్డ పేరేదైనా వస్తే తన మాటెలా ఉన్నా, తరువాత చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు జరుగుతాయా?

ఉష్‌! ఇవన్నీ తను ఎక్కువగా ఊహించుకుంటోందేమో! భరణీ తనను నిజంగానే ప్రేమిస్తున్నాడని ఎందుకనుకోకూడదు.... అతనితో మాట్లాడి, మనసు తెలుసుకుని.... తనవాళ్లు ఎలాగూ పెళ్ళి చేయలేరు.... ఇప్పటికే పాతిక ఏళ్ళు దాటాయి....వయసు దాటిన తరువాత.... యవ్వనం ఉడిగిన తరువాత పొందే సుఖం ఏమిటి? అవును అవకాశాన్ని వదులుకోకూడదు.... హాయిగా అతనితో వెళ్ళి ఆనందంగా కాలక్షేపం చేస్తే సరి!...

భరణీ విజయగర్వంతో టిక్కెట్లు తీసుకుని హాలు బయటకొచ్చాడు. కల్పనా థియేటరులో 'కలల కౌగిళ్ళు' మొదటి ఆట మొదలయ్యింది.

బాల్కనీ సీట్లో బోయ్‌ఫ్రెండ్ భుజంమీద చేయివేసి—పాప్‌కారన్ నములుతూ పగలబడి నవ్వుతోంది సరిత ....

నేల క్లాసు బెంచీలో నిన్ననే తాళి కట్టిన మొగుడిపక్క కూర్చుని, నలిగే తన చేతిని, హృదయాన్ని అదుపు చేసుకుంటూ వెచ్చని ఆవిర్లు విడుస్తోంది గౌరి.

రోడ్డుమీద రిక్షాలో చెల్లెలిపై రుసరుసలాడుతూ ఇంటిముఖం పట్టిన ప్రతిమ రిక్షాలోంచి వెనక్కి ముందుకూ చూస్తూ చేసినపనిని సమర్థించుకునే ప్రయత్నంలో స్థిమితంలేకుండా నిట్టూరుస్తోంది....

"కలల కౌగిళ్లు"కు టిక్కెట్లు తెచ్చిన భరణీ—పరుగెడుతూన్న రిక్షాలోని ప్రతిమను చూసి అప్రతిభుడై, అయోమయంగా నుదురు బాదుకుంటూ అలాగే నిలబడిపోయాడు.